

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

**వేములవాడ,సెప్టెంబర్,04:ప్రజాజ్యోతి.**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో పలు వార్డుల్లో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. మిగతా 2 లో

ప్రజాజ్యోతి

కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

శనివారం 05 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:14

## చొప్పదండిని అభివృద్ధిలో

# ఆదర్శంగా నిలబెడతా



## - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

## - “1000 రోజుల పాలన.. 1000 బైక్‌ల విజయోత్సవం”

**కొడిమ్యాల, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి):**

చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని అంగడి బజార్ నుంచి పూడూర్ వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సుమారు వెయ్యి బైక్‌లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నిర్బంధాలు ఉండేవని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛాయుత పాలన అందుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో 5 వేలకుపైగా ఇళ్ల నిర్మాణం చేపట్టామని, కొత్త రేషన్ కార్డులు, గృహ విద్యుత్, చేయూత పింఛన్లు అందించామని తెలిపారు. మిగతా 2 లో

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం



**- బాకీ కార్డులతో నిరసన, వంట వార్పు కార్యక్రమం**

**- కాంగ్రెస్ పాలనపై కొప్పుల ఈశ్వర్ ధ్వజం**

**ధర్మారం, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ మోసం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. మిగతా 2 లో



# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం

మొదటిపేజీ తరువాయి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ధర్మపురి నియోజకవర్గంలోని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం బాకీ కార్డులతో నిరసన, వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కొప్పుల ఈశ్వర్ నేతృత్వం వహించారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం అమలుకు నోచుకోలేదని విమర్శించారు.మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, విద్యార్థులకు ఉచిత స్కూటీలు వంటి హామీలను ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపించారు. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో ఒక్కో మహిళకు మూడేళ్ల కాలానికి సుమారు రూ.82,500 వరకు బకాయి పడినట్లవుతుందని పేర్కొన్నారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన బీసీ బంధు, ఎస్సీ బంధు, కేసీఆర్ కిట్, పెన్షన్ల పెంపు తదితర సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పేదలు, మహిళలు, వృద్ధులు, రైతులు, విద్యార్థులకు గతంలో అందిన ప్రయోజనాలు ప్రస్తుతం అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి కంటే ప్రకటనలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.కేసీఆర్ హయాంలో రైతుబంధు, ఉచిత విద్యుత్, సాగునీటి వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చామని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. రూ.94 వేల కోట్లతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణలో సాగు విస్తీర్ణం, ధాన్యం ఉత్పత్తి పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం యూరియా కొరత, నీటి ఎద్దడి వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.విద్యారంగంలోనూ ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేసి ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి సుమారు రూ.1.20 లక్షల వరకు ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం సరైన పర్యవేక్షణ లేక పాఠశాలల్లో మౌలిక వసతులు క్షీణిస్తున్నాయని, అడ్మిషన్లు తగ్గి పలు పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపించారు.ప్రజల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన బీఆర్ఎస్ మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు. వంటావార్పు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, మాజీ ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, పార్టీ మాజీ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, ధర్మారం పట్టణ మాజీ అధ్యక్షుడు తుమ్మల రాంబాబు, సర్పంచులు మోతె కనకయ్య, మంద శ్రీనివాస్, సంకసాని సౌజన్య సతీష్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, గొల్లపల్లి, పెగడపల్లి మాజీ జెడ్పీటీసీలు గోస్కుల జలంధర్, తాటిపర్తి శోభారాణి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు పాకాల రాజయ్య, వివిధ మండలాల ఏఎంసీ మాజీ చైర్మన్లు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, ఏలేటి కృష్ణారెడ్డి, ముల్కల గంగారం, పత్తిపాక వెంకటేష్, అయ్యోరి రాజేష్‌తో పాటు ఆయా మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ బద్దం సుజాత,అపర్ణ, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల చిన్నారులతోకలిసి జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు..శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం ధర్మం, సత్యం, న్యాయం పట్ల మనకు స్ఫూర్తినిస్తుందని, భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన సందేశాలు ఎంతో గొప్పవని విప్ పేర్కొన్నారు.అనంతరం వేములవాడ అర్బన్ మండలం అరపేట గ్రామంలోని ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శ్రీకృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఇస్కాన్ ప్రతినిధులు వారికి ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు

# చొప్పదండిని అభివృద్ధిలో ఆదర్శంగా నిలబెడతా

మొదటిపేజీ తరువాయి



25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేసి, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు.చొప్పదండి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రామడుగులో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్, గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కొడిమ్యాలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్, కొండగట్టు జేఎన్టీయూకు యూనివర్సిటీ హోదా కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని ఇరిగేషన్, ఎడ్యుకేషన్, పరిశ్రమల రంగాలకు హబ్‌గా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడతానన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషన్ రెడ్డి,సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్ రెడ్డి,మండల అధ్యక్షుడు కడారి మల్లేశం,ప్యాక్స్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు,చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కొత్తూరి మహేష్,యువజన నాయకుడు చిర్ర చింటు,ఏయంసి వైస్ చైర్మన్ కొండూరి రాజేష్,యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్,మండల అధ్యక్షుడు గాజుల అజయ్, నాయకులు గోల్కొండ రాజు, అంతడుపుల జలందర్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ముదిరాజులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

## - పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూతగడ్డ సంపత్‌కు

## - ముదిరాజ్ సంఘం ఘన సన్మానం

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి:**



పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ముదిరాజ్ బిడ్డ భూతగడ్డ సంపత్ నియమితులైన సందర్భంగా పెద్దపల్లి జిల్లా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు తమ పార్టీల్లో కొనసాగుతున్న ముదిరాజులను గుర్తించి తగిన రాజకీయ ప్రాధాన్యత, గుర్తింపు కల్పించాలని కోరారు. ముదిరాజుల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి అన్ని పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.భూతగడ్డ సంపత్‌కు పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి దక్కేలా సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్‌లకు జిల్లా ముదిరాజ్ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్ధ మధు ముదిరాజ్, గరిగంటి నరసింహారాజు ముదిరాజ్, ఎల్లంకి పోచాలు ముదిరాజ్, చింతల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి:**




శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గాయత్రి విద్యానికేతన్‌లో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు.గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీకృష్ణుని విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కరస్పాండెంట్ రజనీ దేవి విద్యార్థులకు శ్రీకృష్ణుని జన్మ విశిష్టత, కృష్ణ తత్వం, ఆయన బోధించిన ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను వివరించారు.6వ, 7వ, 2వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 1వ తరగతి విద్యార్థి�ణ. సాయి శ్రీమాన్ జగన్నాథ స్వామి వేషధారణలో అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాడు .విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం ఆద్యంతం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణంలో సాగింది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, శ్రీకృష్ణుని జీవితం, బోధనలు పరిచయం అవుతాయని, భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించాలని తల్లిదండ్రులు ఆకాంక్షించారు.

# కూతురి అంత్యక్రియల వేళ తల్లి గుండె ఆగింది

## కరీంనగర్ దుర్శేడ్‌లో విషాదం

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 04,(ప్రజాజ్యోతి):**

ఒకవైపు అనారోగ్య సమస్యలతో కూతురు ఆత్మహత్య చేసుకోగా మరోవైపు ఆమె అంత్యక్రియల సమయంలో తల్లి గుండెపోటుతో మృతి చెందడం కరీంనగర్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది.కరీంనగర్ దుర్శేడ్ గ్రామానికి చెందిన చీలుపల్లి శ్రీవిద్య (36) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతోంది.శుక్రవారం ఉదయం బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా.. చీరతో ఉరేసుకుని కనిపించింది. వెంటనే ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.శ్రీవిద్య మృతిపై ఎలాంటి అనుమానం లేదని ఆమె తల్లి సవిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.అయితే కూతురి మృతితో తీవ్ర విషాదంలో మునిగిపోయిన తల్లి సవిత ఉదయం నుంచి కన్నీరు మున్నీరుగా విలపించారు.అనంతరం కూతురి అంత్యక్రియల కోసం శ్మశానవాటికకు చేరుకున్నారు.కళ్లముందే కూతురి మృతదేహాన్ని చూస్తూ తీవ్రంగా రోదిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఆమెకు గుండెపోటు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.వెంటనే సవితను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మార్గమధ్యలోనే ఆమె మృతి చెందింది,కూతురి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లి అదే కూతురి అంత్యక్రియల వేళ ప్రాణాలు కోల్పోవడంతో దుర్శేడ్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన విఫలం..

## - ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేదు నాస్కాబ్ చైర్మన్

## - కొండూరి రవీందర్ రావు



**గంభీరావుపేట సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):**

గంభీరావుపేటమండల కార్యాలయం ఎదుట బి ఆర్ ఎస్ మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వం పై నిరసన కార్యక్రమం, మరి వంట వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండూరి రవీందర్ రావు హాజరై మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో పూర్తిస్థాయిలో ఏ ఒక్క హామీని అమలు చేయలేదని,ఎన్నికల సమయంలో మహిళలు, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని అన్నారు .18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 రూపాయలు ఇస్తామని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు .కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు .కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్ వంటి ప్రజలకు ఉపయోగపడే పథకాలను రాజకీయ కారణాలతో నిలిపివేయడం సరికాదని అన్నారు .గర్భిణీలు, బాలింతలకు అందించే సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, వితంతువులు, ఇతర అర్హులకు పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.రైతులు ఎరువుల కొరత, ఇబ్బందులు పడుతున్నారని అన్నారు .అధికారంలో ఉన్నా లేకున్నా బీఆర్ఎస్ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటుందనిఅన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఇట్టి కార్యక్రమంలో పాప గారి వెంకట స్వామి గౌడ్, పెద్ద వేణి వెంకట యాదవ్, ఏగదండి స్వామి, రెడ్డి మల్ల రాజనర్సు, బండి శ్రీమతి, కొమిరిశెట్టి లక్ష్మణ్, లక్కిరెడ్డి లత, గంధ్య డప్ రాజు, దోషల శంకర్, ఈరవేణి శివయ్య, కల్వకుంట్ల కిషన్ రావు, తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అరాచకాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు:

## - బిజెపి మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్

**కేశవపట్నం:సెప్టెంబర్4 (ప్రజా జ్యోతి)**

కరీంనగర్ జిల్లా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై, మహనీయుడు సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లరంగు చల్లి అవమానించడాన్ని నిరసిస్తూ, అలాగే నల్గొండ జిల్లాలో బీజేపీ క్యాంపు కార్యాలయం మరియు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై జరిగిన దాడిని ఖండిస్తూ కేశవపట్నం మండల కేంద్రంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల శాఖ అధ్యక్షులు కనకం కుమారస్వామి మండల శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడం, సంత్ రవిదాస్ చిత్రపటాన్ని అవమానించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన ఖండించారు.అలాగే నల్గొండ జిల్లాలో బీజేపీ క్యాంపు కార్యాలయంపై, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణమని అన్నారు. ఈ దాడిలో ఆయన తల్లి గాయపడటం అత్యంత అమానుషమని, మహిళల పట్ల కూడా కనీస గౌరవం లేకుండా కాంగ్రెస్ శ్రేణులు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఏనుగుల అనిల్మాట్లాడుతూ, ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి మా హెచ్చరిక. భారతీయ జనతా పార్టీ సహనాన్ని చేతకానితనంగా భావించవద్దు. హద్దుల్లో ఉండండి. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇప్పటికే గమనిస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ, ప్రతిపక్షాలపై దాడులు చేయడం మానుకోవాలి. భారతీయ జనతా పార్టీ ఉద్యమించాలని నిర్ణయించుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా మనుగడ ఉండదు. ప్రజల సమస్యలను పరిష్కరించి సుపరిపాలన అందించడంపై దృష్టి పెట్టాలి. అరాచకాలు, గూండాయిజం, ప్రతీకార రాజకీయాలకు స్వస్తి చెప్పాలి అని హెచ్చరించారు.బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ మరింత ఉద్ధృతంగా పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ దండు కొమురయ్య , మాజీ ఎంపీపీ దొంగల రాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ దాసరపు నరేందర్, బిజెపి సర్పంచ్లు వెన్నం మల్లేశం కొయ్యడ కుమార్ యాదవ్, ఉప సర్పంచ్ జంగ జైపాల్, కొయ్యడ అశోక్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మచెట్టు సంపత్ రావు,మండల ఉపాధ్యక్షులు ఎలుక పెల్లి సంపత్ , రాసమల్ల శ్రీనివాస్ , కార్యదర్శి గౌరవేణి శ్రీనివాస్ , బిజిలి సారయ్య, బోడ తిరుపతిరెడ్డి,మహిళ మోర్చాఅధ్యక్షురాలు చర్ల అనిత యువ మోర్చా మండల అధ్యక్షుడు బొజ్జ సాయి ప్రకాష్ బిజెపి సీనియర్ నాయకులు పలకల రాజిరెడ్డి, మందాడి జగ్గారెడ్డి, రాజిరెడ్డి.జాన పట్ల రాజిరెడ్డి దాసరి సంపత్,చర్ల శ్రీనివాస్ , శివారెడ్డి, వీరా అర్జున్, రంజిత్ శ్రీనాథ్ ,కుమార్ , వికాస్, సాయి, మైపాల్ ,బీజేపీ మండల నాయకులు, ఎస్సీ మోర్చా నాయకులు, శక్తికేంద్ర ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 1000 రోజుల కాంగ్రెస్ వైఫల్యాలపై మహిళల ఆగ్రహం

## - దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిరసన, వంటావార్పు

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మహిళలు రోడ్డుపైనే కూరగాయలు తరిగి వంటావార్పు నిర్వహించారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలతో పాటు ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ పాటలు పాడి వినూత్నంగా నిరసన తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెంచిన పెన్షన్లు, విద్యార్థినీలకు స్కూటీలు, కల్యాణలక్ష్మిషాదీముబారక్ మొత్తాల పెంపు వంటి హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. “ఒక్క నెల ఆగండి.. రూ.4,000 పెన్షన్ ఇస్తాం” అని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, 1000 రోజులు పూర్తవుతున్నా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒంటరి మహిళలకు పెన్షన్, బీడీ కార్మికులకు పెన్షన్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్



కిట్ వంటి పథకాలను అమలు చేసి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. విద్యార్థినీలకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం సైకిళ్లు కూడా ఇవ్వలేకపోతోందని ఎద్దేవా చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు.మహిళలను మోసం చేసిన కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమత రెడ్డి మాట్లాడుతూ మహిళల ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వాటిని ఒక్కొక్కటిగా పక్కన పెడుతోందని విమర్శించారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, విద్యార్థినీలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మొత్తాల పెంపు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి సంక్షేమ పథకాలను బలోపేతం చేయాల్సింది పోయి వాటి ప్రయోజనాలను మహిళలకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వాటికి గడువు ప్రకటించాలని, లేకపోతే మహిళలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని దాసరి మమత రెడ్డి హెచ్చరించారు. మహిళల హక్కులు, హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.

# అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 04,(ప్రజాజ్యోతి):**

కరీంనగర్ దుర్శేడ్ గ్రామంలో శుక్రవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది.కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చీలుపల్లి శ్రీవిద్య (36) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతోంది. శుక్రవారం ఉదయం బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపు తెరిచి చూడగా చీరతో ఉరేసుకుని కనిపించింది.వెంటనే ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతురాలికి భర్త,ఒక కుమార్తె ఉన్నారు. గత నెల రోజులుగా భర్త హైదరాబాద్‌లోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ అక్కడే ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు.తన కుమార్తె మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతురాలి తల్లి జిల్లా సవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.



# అక్రమ ఇసుక రవాణా.. మూడు ట్రాక్టర్లు పట్టివేత

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 04,(ప్రజాజ్యోతి):**

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు.దుర్శేడు నుంచి కరీంనగర్ వైపు వస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేయగా, చేగుర్తి ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.దీంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని డ్రైవర్లు ఎగురుల వెంకటేశం, గన్ను మణిదీప్, భూతం మధులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ ఏ. నిరంజన్‌రెడ్డి తెలిపారు.అక్రమ ఇసుక రవాణా పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని నిందితులను తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేయడంతో పాటు, పునరావృతంగా అక్రమ రవాణాకు పాల్పడితే నిబంధనల ప్రకారం షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.



# భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశం

## 2029 లో బిజెపి అధికారంలోకి రావడమే లక్ష్యం



**గంభీరావుపేట సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)**

గంభీరావుపేట మండల కేంద్రంలోబీజేపీ మండల అధ్యక్షులు కోడె రమేశ్ ఆధ్వర్యంలో మండల కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఉడువుల యాదగిరి హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ,, ప్రతి కార్యకర్త ఒక కుటుంబ సభ్యుడిలా 2029లో అధికారమే లక్ష్యం ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వివరించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తే పార్టీకి బలండ కార్యకర్తే విజయానికి పునాది! రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, 2029లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాల మహేష్, బండ దేవయ్య జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ ధార్మిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు వజిత్ హుస్సేన్ నాయకులు పత్తి స్వామి సర్వోత్తమ్ దేవేందర్ గౌడ్ కృష్ణ కాంతి యాదవ్ నాగరాజు గౌడ్ దేవా గౌడ్ సత్యనారాయణ రవీందర్ శ్రీశైలం యాదవ్ దేవేందర్ యాదవ్ నర్సింలు దేవేందర్ నాయక్ శ్రీనివాస్ గౌడ్ అంజన్ రావు రమేష్ నవీన్ రాజు రెడ్డి రాజు తిరుపతి శ్రీనివాస్ చారి నాయకులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ అభివృద్ధికి అడ్డంకిగా కౌశిక్ రెడ్డి

## - రఘుపాల్ రెడ్డి ఫైర్

**వీణవంక , సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి)**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన వెయ్యి రోజుల్లో ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు ప్రజలే సమాధానం చెబుతారని పేర్కొన్నారు.సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, రైతులకు బోనస్, రైతు భరోసా, రుణమాఫీ, సీఎంఆర్ఎఫ్ సహాయం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు.హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి లేదని రఘుపాల్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నియోజకవర్గానికి తీసుకొచ్చిన అభివృద్ధి నిధులు, చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు.హుజురాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నిరసన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. ప్రజా సమస్యలపై నిజమైన పోరాటం చేయకుండా రాజకీయ ఉనికి కోసం డ్రామాలు చేయడం సరికాదని రఘుపాల్ రెడ్డి అన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండాల్సిన ఎమ్మెల్యే రాజకీయ విమర్శలకే పరిమితం కావడం విచారకరమన్నారు."ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించింది వారి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించేందుకు.. రాజకీయ అధిష్టానాల మెప్పు కోసం పనిచేయడానికి కాదు" అని ఎక్కటి రఘుపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. హుజురాబాద్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలతో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# మోరీలు తవ్వారు.. పూడ్చడం మరిచారు..!

- పెద్దపల్లి ప్రధాన రహదారి విస్తరణలో మున్సిపాలిటీ తీరుపై వ్యాపారుల ఆవేదన
- రాజకీయ ఒత్తిళ్లతో చిన్న వ్యాపారులపై వేధింపుల ఆరోపణలు
- పండుగల సీజన్ వ్యాపారాలపై ప్రభావం

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి:**

పెద్దపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులు వ్యాపారులు, భవన యజమానులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాల ముందు డ్రైనేజీ నిర్మాణం కోసం భారీ గోతులు తవ్విన మున్సిపల్ అధికారులు.. వాటిని సుమారు 25 రోజులుగా అలాగే వదిలేయడంతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కోర్టును ఆశ్రయించిన వ్యాపారులు

రోడ్డు విస్తరణకు సంబంధించి తమ ఆస్తుల విషయంలో నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన ప్రక్రియను పాటించాలని కోరుతూ పలువురు వ్యాపారులు, భవన యజమానులు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. కోర్టు నుంచి తమకు న్యాయపరమైన రక్షణ, ఉత్తర్వులు లభించినప్పటికీ అధికారులు వాటిని పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చిన్న వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు.అధికారులు సూచించిన మార్కింగ్ మేరకు ఇళ్లు, వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఒత్తిడి చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. తమ ఆస్తుల విషయంలో చట్టబద్ధమైన ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

### గోతులతో వ్యాపారానికి గండి

ఇదిలా ఉండగా.. దుకాణాల ముందు డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్విన భారీ గోతులను పనులు పూర్తిచేయకుండా వదిలేయడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. గోతుల కారణంగా దుకాణాల వద్దకు కస్టమర్లు చేరుకోవడం కష్టంగా మారిందని, దీంతో రోజువారీ అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు.ముఖ్యంగా ముందున్న దసరా, దీపావళి పండుగల సీజన్ తమకు అత్యంత కీలకమని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఏడాది మొత్తంలో జరిగే వ్యాపారంలో ఈ కాలానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని, ప్రస్తుతం రోడ్డు పనులు, గోతుల కారణంగా వినియోగదారులు దుకాణాల వైపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగల సీజన్ వ్యాపారం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

### దుర్గంధం.. దోమల బెడద

తవ్విన మోరీల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. దోమలు, ఈగలు పెరిగిపోవడంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్లు, దుకాణాల్లోకి వెళ్లేందుకు సరైన మార్గం లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని పేర్కొంటున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

ఒకవైపు కోర్టు ఆదేశాలను గౌరవించకుండా ఆస్తుల విషయంలో ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వస్తుండగా.. మరోవైపు ప్రజలకు అవసరమైన డ్రైనేజీ, రాకపోకల సౌకర్యాలను కల్పించే పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు, వ్యాపార సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై అనుమానాలు

- నిరుపేదలకు కాకుండా ఆస్తులు ఉన్నవారికేనా? - సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్

**జమ్మికుంట, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని జమ్మికుంట ధర్మారం ప్రాంతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్హులైన నిరుపేదలను పక్కనపెట్టి భూములు, జాగాలు, ఆస్తులు ఉన్నవారికి ఇళ్లు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సొంత గూడు కల్పించాలనే ఉద్దేశంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించింది. అయితే అర్హత కలిగిన పేదలకు కాకుండా ఆస్తులు ఉన్నవారికి ఇళ్లు కేటాయిస్తే పథకం అసలు లక్ష్యం నీరుగారే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇళ్ల కేటాయింపు విషయంలో కొందరు కౌన్సిలర్లు తమకు అనుకూలమైన వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇల్లు లేని నిరుపేదల నుంచి లబ్ధి చేకూర్చేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు సైతం స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

### నిబంధనల ప్రకారమే కేటాయింపులా?

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా? అర్హత లేని వారికి లబ్ధి చేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలనే ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వార్డుల వారీగా ఎంపిక చేసిన లబ్ధిదారుల



జాబితాలను బహిరంగంగా ప్రకటించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.ఇళ్ల కేటాయింపులో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు లేదా డబ్బుల డిమాండ్‌కు సంబంధించిన ఫిర్యాదులు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు

# వేములవాడ శ్రీ మహాలక్ష్మి ఆలయంలో వైభవంగా శ్రావణ నాలుగో శుక్రవారం పూజలు

**వేములవాడ,సెప్టెంబర్,04:ప్రజాజ్యోతి.**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. పూర్వం సంస్కృత పాఠశాలగా విరాజిల్లిన పవిత్ర ప్రాంగణంలో కొలువుదీరిన లక్ష్మీదేవికి వేదోక్తంగా శాస్త్రోక్త పూజాధికాలు నిర్వహించారు.వేదమంత్రోచ్చారణల నడుమ విశేష సేవలు తెల్లవారుజామున బ్రాహ్మీ ముహూర్తంలో అమ్మవారికి మంగళస్నానం, అభ్యంగన స్నానము ఆచరింపజేసి ఘనంగా మహాభిషేకం జరిపారు. ఉదయం 8 గంటల నుంచి లోకకల్యాణార్థం, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ ప్రత్యేక హోమ కార్యక్రమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం సువాసినుల చేత సామూహిక లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఒక మహిళా భక్తురాలు 108 కమలాలను (తామర పూలను) సమర్పించి, అష్టోత్తర శతనామాలతో విశేష అర్చన జరిపించారు.మంగళ వాయిద్యాలతో ఊరేగింపు షోడశోపచార పూజలు సాయంత్రం 4 గంటలకు శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ప్రధాన దేవాలయం నుంచి అర్చకులు, వేద పండితులు మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా మహాలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి షోడశోపచార పూజలు, విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి నిత్యం ఉదయం, సాయంత్రం 64 ఉపచారములతో (చతుష్షష్టి) విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.సంతాన, సౌభాగ్య



ప్రదాయిని 'ఛాయానక్త పూజ' శ్రావణ శుక్రవారం సూర్యాస్తమయ వేళ నిర్వహించే 'ఛాయానక్త పూజ'కు శాస్త్రాలలో విశేష ప్రాధాన్యం ఉందని పండితులు పేర్కొన్నారు. ఈ పూజలో పాల్గొనడం వల్ల దారిద్ర్య బాధలు సమసిపోయి, ఆర్థికాభివృద్ధి, సంతాన సౌభాగ్యం, వంశాభివృద్ధి చేకూరుతాయని తెలిపారు.ఆలయానికి తరలివచ్చిన మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీర, సారె, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. "యా దేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా" అంటూ లక్ష్మీ స్తోత్రాలు పఠిస్తూ ఒకరికొకరు పసుపు, కుంకుమలు, వాయినాలు అందజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ఏఈవో జయకుమారి, ఆలయ పర్యవేక్షకులు పూజిత, వెంకటలక్ష్మి, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు దేవస్థాన సమాచార జారీ: పెరిక శ్రీనివాస్, ఆలయ పీఆర్వో తెలిపారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారానికి ఎంపిక.... 38 ఏళ్ల విద్యా బోధనకు గుర్తింపు.....

- ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మనోహరాచారి ఎంపిక....

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి**

ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న తిరుమల మనోహరాచారి (పెద్దబడి) ప్రధానోపాధ్యాయులకు విద్యా రంగంలో గత 38 సంవత్సరాలుగా విద్యార్థులకు అంకితభావంతో సేవలందించినందుకు గాను ప్రభుత్వం మనోహరాచారికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు రావడం పట్ల మండల ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు సెప్టెంబర్ 5 సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఈ అవార్డును ప్రధానం చేస్తారు.



# నిట్టూరులో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి;**

కోదండరామాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.సాయంత్రం స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించడంతో పాటు శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి పారాయణం, పవళింపు సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు చిన్నారులచే ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు తమ చిన్నారులను రాధాకృష్ణుల వేషధారణలో ఆలయానికి తీసుకువచ్చారు. చిన్నారుల రాధాకృష్ణ వేషధారణలు, ఉట్టికొట్టే కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కిటకిటలాడింది.ఈ కార్యక్రమం ఆలయ అర్చకులు శ్రీ కొండపాక వెంకటాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



# కృష్ణాష్టమి వేడుకలను ప్రారంభించిన మాజీ ఎంపీ పీ గోపగోని సారయ్య గౌడ్

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో .యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కృష్ణ అష్టమి కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ శుక్రవారం రోజున పలువురు యాదవ సంఘం నాయకులతో కలిసి ప్రారంభించారు. గంగారం గ్రామంలో ఏర్పాటు చేసిన కృష్ణ అష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ తో పాటు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జన వేన సదయ్య. శ్రీరాంపురం సర్పంచ్ బంగారు రమేష్. లను. శాలువలతో గంగారం గ్రామంలో. ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు అల్లంల దేవేందర్. వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు.ఉప సర్పంచ్ గోలి సుధాకర్. రేకుల జ్యోతి రఘు. తదితరులు పాల్గొన్నారు.



# వల్బాపూర్‌లో దశదినకర్మకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరు

**వీణవంక , సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి)**

వల్బాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జీడి వెంకటస్వామి మామ మారముల్ల దుర్గయ్య ఇటీవల మృతి చెందగా, శుక్రవారం నిర్వహించిన ఆయన దశదినకర్మ కార్యక్రమానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శిం చారు.ఈ సందర్భంగా దుర్గయ్య చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ దిలీప్‌కుమార్, వైస్ చైర్మన్ జావిద్ అలీ, కామీడి శ్రీనివాస్‌రెడ్డి, నలుబాల మధు సగర, నలబాల రాజేష్ తదితరులు పాల్గొని దుర్గయ్యకు నివాళులర్పించారు.



# ఆరెపల్లిలోని ఇస్కాన్ ఆలయంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## - పూర్ణాహుతి హోమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరణలో పాల్గొన్న డాక్టర్ మనోహర్

**వేములవాడ,సెప్టెంబర్,04:ప్రజాజ్యోతి.**

శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లిలోని శ్రీకృష్ణ చైతన్య మఠం (ఇస్కాన్ టెంపుల్)లో శుక్రవారం రోజున వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్, పట్టణ ప్రముఖ వైద్యులు మనోహర్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల



నడుమ నిర్వహించిన ప్రత్యేక హోమంలో ఆయన పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం స్వామివారి



తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అల్లాడి రమేష్ మాట్లాడుతూ... మానవాళికి ధర్మ మార్గాన్ని, కర్మ సిద్ధాంతాన్ని ఉపదేశించిన శ్రీకృష్ణ భగవానుడి జన్మాష్టమి వేడుకలను జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సమాజంలో అధర్మాన్ని రూపమాపి, ధర్మాన్ని ప్రతిష్టించేందుకు భగవద్గీతలో శ్రీకృష్ణుడు తెలిపిన మార్గం నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. భక్తిభావాన్ని పెంపొందించుకుంటూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రశాంత వాతావరణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వేడుకల్లో డాక్టర్ ఖ. మనోహర్, ఇస్కాన్ ఆలయ నిర్వాహకులు గజవాడ గణేష్, కముటాల వేణు, రాజు, మదిశేటి కృపాల్, మల్యాల మహేందర్లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు విధులకు ఆటంకం

## - బీఆర్ఎస్ కార్యకర్తల అరెస్ట్.- నలుగురిని రిమాండ్‌కు తరలింపు.

## - అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించొద్దు...... - ఎస్ఐ ఎన్. రమేష్

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04 (ప్రజా జ్యోతి)**

ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఆరోపణలపై నలుగురు బీఆర్ఎస్ కార్యకర్తలను ఎల్లారెడ్డిపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్లారెడ్డిపేట పాత బస్టాండ్ వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న ఘటనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాత బస్టాండ్ వద్ద రోడ్డుపై ధర్నా నిర్వహించి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పిండప్రదానం చేయడంతో పాటు ఇరువర్గాల మనోభావాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించి ప్రజాశాంతికి భంగం కలిగించారని పోలీసులు తెలిపారు. ధర్నా సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి కూడా ఆటంకం కలిగించడంతో సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కేసులో భాగంగా బొప్పాపూర్‌కు చెందిన ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేటకు చెందిన పందిర్ల పరుశురాములు, బొప్పాపూర్‌కు చెందిన ఎల్లారెడ్డిపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వరస కృష్ణహరి, దుమాల సర్పంచ్ సోమారపు శరవింద్‌లను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**అనుమతి లేకుండా నిరసనలు చేపట్టొద్దు**

జిల్లాలో ప్రస్తుతం పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని



ఎల్లారెడ్డిపేట ఎస్ఐ ఎన్. రమేష్ స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా రహదారులను దిగ్బంధించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, పోలీసుల విధ ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ శాంతియుత వాతావరణానికి సహకరించాలని ఎస్ఐ కోరారు.

## యూరియా యాప్ రద్దు చేయకపోతే సొసైటీ ముందు ధర్నా

- పది రోజులుగా యూరియా లేక అల్లాడుతున్న రైతులు.. వరి పంటలు ఎర్రబడి రోగాల బారిన

- కేంద్రం తెచ్చిన యాప్ తో తీవ్ర ఇబ్బందులు..

పాస్ బుక్ తో యూరియా ఇవ్వాలని డిమాండ్

**కోనరావుపేట,సెప్టెంబర్.03 (ప్రజా జ్యోతి)**

అప్పట్లో వర్షాలు లేక నష్టపోయిన రైతులు.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ తో పది రోజులుగా యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.యాప్ ఎలా వాడాలో తెలియక చాలా మంది రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు తెలిసిన వారి దగ్గరికి వెళ్తున్నారు. వారు వెళ్లేసరికి టైం అయిపోయిందని చెబుతుండడంతో రోజూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. యాప్ లో స్లాట్ ఓపెన్ అయిన రెండు మూడు సెకన్లలోనే క్లోజ్ అవుతుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సకాలంలో యూరియా చల్లకపోవడంతో వేసిన వరి పంటలు ఎర్రబడుతున్నాయి. పంటకు ఇతర రోగాలు వస్తున్నాయని, దీంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

**రైతుల డిమాండ్:**

వెంటనే ఈ యూరియా యాప్ విధానాన్ని తొలగించి, గతంలో మాదిరిగా రైతు పాస్ బుక్, ఆధార్ కార్డు చూసి నేరుగా యూరియా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు.ఇవ్వని యెడల తమ పంటలను తీసుకువచ్చి సొసైటీ ముందు ధర్నా, నిర్వహిస్తామని రైతులు హెచ్చరించారు.




## వీఓఏగా అవకాశం కల్పించాలి,

- మంత్రి అడ్లూరీ కి వినతి పత్రం అందించిన సిగిరి సునీత ఆనంద్,

**ఎండపల్లి, సెప్టెంబర్ 4, ప్రజా జ్యోతి**

మండలంలోని చెర్లపల్లి గ్రామంలో వీఓఏగా విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ సిగిరి సునిత శుక్రవారం రోజున సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 2009 నుంచి 2025 వరకు వీఓఏగా విధులు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. గ్రామంలో వీఓ భవనం కోసం నిర్మాణానికి కృషి చేసినట్లు,అలాగే ఐకేపీ కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోళ్లలోనూ సేవలందించినట్లు, పేర్కొంటూ,ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీఓఏ పదవికి రాజీనామా చేసినట్లు కానీ ఎన్నికల్లో ఓడిపోయినట్లు వినతి పత్రంలో తెలిపారు , ప్రస్తుతం తిరిగి వీఓఏగా విధులు నిర్వహించే అవకాశం కల్పించాలని ,ఈ విషయంపై , డీఆర్‌డీవో అధికారులతో మాట్లాడి సహకరించాలని మంత్రిని కలిసి విన్నవించారు,





## భగవంతరావు నగర్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### - వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

**వేములవాడ,సెప్టెంబర్,4:(ప్రజాజ్యోతి):**

వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగవంతరావు నగర్ యాదవ సంఘం వద్ద బీజీఆర్ కింగ్స్ యాదవ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని యువసేన సభ్యులు, యాదవ సంఘం నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ వేములవాడ శాసన సభ్యులు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలకు వేములవాడ భగవంతరావు నగర్ నిలయంగా ఉందన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ధర్మాన్ని కాపాడుతూ, సమాజంలో ఐక్యత, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించడమే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.తమ యాదవ యువసేన ఆధ్వర్యంలో గత 26 సంవత్సరాలుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిరంతరంగా నిర్వహిస్తున్నామని సిర్రాం ప్రసాద్ యాదవ్ తెలిపారు. ప్రతి సంవత్సరం వేడుకలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. యువతలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు



దోహదపడతాయని చెప్పారు.మునిసిపల్ చైర్మన్ మాట్లాడు చూ శ్రీకృష్ణుడి జీవిత చరిత్ర, ఆయన బోధనలు, ధర్మ పరిరక్షణ కోసం చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వేడుకల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో భగవంతరావు నగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమం లో మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్ లు, కాంగ్రెస్ నాయకులు,యాదవ సంఘం నాయకులు, బీజీఆర్ కింగ్స్ యాదవ యువసేన సభ్యులు, మహిళలు, యువత, స్థానిక భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## వివాహ వేడుకకు హాజరైన డాక్టర్ ప్రసన్న హరికృష్ణ

**వేములవాడ,సెప్టెంబర్,04:ప్రజాజ్యోతి.**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో గుండన్న పల్లి గ్రామానికి చెందిన మేడుదుల ప్రశాంత్ పెళ్లికి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ హాజరై వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గుండన్నపల్లి సర్పంచ్ కొప్పుల లావణ్య నగేష్, సిర్రశీ ప్రసాద్ మేడుదుల రాజేష్, కొప్పుల రాజు, నంది మహేష్,పెంట రాజేందర్ ప్రముఖులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి కి పిండ ప్రధానం పోలీసులు కేసు నమోదు

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 4(ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం రోజు రేవంత్ రెడ్డి 420 హామీలకు నిరసనగా వెయ్యి రోజుల పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు పిండ ప్రధాన ని నిర్వహించి ధర్నా చేశారు ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పార్టీ విధానాలను విమర్శిస్తూ నినాదాలు చేస్తూ ధర్నాను నిర్వహించారు .అనంతరం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని ని పిండ ప్రధానం చేశారు. ప్రధానం చేసిన బిఆర్ఎస్ నాయకులపై అనుమతి లేకుండా ధర్నా నిర్వహించినందుకు పిండ ప్రధాన చేసినందుకు ఎల్లారెడ్డిపేట ఎస్సై రమేష్ కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు.



# మంటల్లో 'కేక్ జోన్'

## - కరీంనగర్ లో విశ్వ కేక్ జోన్ బేకరీ దగ్ధం- సుమారు రూ.15-20 లక్షల నష్టం

## - హైటెన్షన్ లూజ్ లైన్లే కారణమని బాధితుల ఆరోపణ

## - ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 04,(ప్రజాజ్యోతి):**

నగరంలోని వావిలాలపల్లిలోని విశ్వ కేక్ జోన్ బేకరీలో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.ఏళ్లుగా కష్టపడి ఏర్పాటు చేసుకున్న వ్యాపారం










కళ్లముందే కాలిపోవడంతో బేకరీ యజమాని కుటుంబం కన్నీరు మున్నీరైంది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు యజమాని తెలిపారు.శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బేకరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.అయితే అప్పటికే బేకరీలోని కేకులు,తయారీ సామగ్రి,యంత్రాలు,ఇతర వస్తువులు మంటల్లో కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

### విద్యుత్ లైన్లే కారణమా?

బేకరీకి అతి సమీపంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లు, లూజ్ వైర్ల కారణంగానే మంటలు చెలరేగాయని బాధితులు ఆరోపించారు.విద్యుత్ లైన్ల నిర్వహణ విషయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందా? అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను నిగ్గు తేల్చాలని వారు కోరుతున్నారు.అయితే అగ్నిప్రమాదానికి అసలు కారణం అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. విద్యుత్ లోపం కారణమా? లేక ఇతర కారణాల వల్ల మంటలు చెలరేగాయా? అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

### ఏళ్ల కష్టం బూడిద...

బేకరీనే నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నామని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నో ఏళ్లుగా కష్టపడి సంపాదించిన మొత్తంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నామని,ఇప్పుడు ఒక్క ప్రమాదంతో సర్వం కోల్పోయామని వాపోయారు.బేకరీలోని సామగ్రి, యంత్రాలు,నిల్వ ఉన్న వస్తువులు దగ్ధం కావడంతో భారీగా నష్టం వాటిల్లిందన్నారు.

### బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే గంగుల...

ప్రమాద విషయం తెలుసుకున్న మాజీ మంత్రి,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు.దగ్ధమైన బేకరీని పరిశీలించి నష్ట వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

### ప్రభుత్వం ఆదుకోవాలి...


అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బేకరీ యజమాని కోరారు.అధికారులు నష్టాన్ని అంచనా వేసి తగిన సహాయం అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.అంతేకాకుండా బేకరీ పరిసరాల్లో ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లు,లూజ్ వైర్లను పరిశీలించి ప్రమాదకర పరిస్థితులు ఉంటే వెంటనే సరిచేయాలని కోరుతున్నారు.జీవనోపాధి కోసం ఏళ్లుగా నిర్మించుకున్న బేకరీ ఒక్కసారిగా అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.ప్రమాదానికి కారణం ఏదైనా సరే.. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బేకరీ యజమాని కోరారు,

# జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ మహిళా నాయకురాలికి పరామర్శ

- మమతను పరామర్శించిన డాక్టర్ అనూప్ రావు దంపతులు- ఆరోగ్య పరిస్థితిపై వైద్య సిబ్బందితో ఆరా.. కుటుంబ సభ్యులకు ధైర్యం

**కోరుట్ల సెప్టెంబర్ 04 ప్రజాజ్యోతి**

జగిత్యాల జిల్లా బీజేపీ మహిళా మోర్చా కార్యదర్శి ఛేట్టిపల్లి మమత ప్రస్తుతం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ స్వీతి అనూప్ రావు ఆసుపత్రికి వెళ్లి మమతను పరామర్శించారు.ఈ సందర్భంగా మమత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న డాక్టర్ స్వీతి అనూప్ రావు.. అనంతరం ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి ఆమెకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. మమతకు పలు ఆరోగ్య జాగ్రత్తలు, సూచనలు అందిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం మమత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనారోగ్య సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనూప్ రావు, జగిత్యాల జిల్లా బీజేపీ కార్యదర్శి సుదవేని మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం,

- కొత్తపేటలో గృహప్రవేశానికి హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్,

**ఎండపల్లి, సెప్టెంబర్ 4, ప్రజా జ్యోతి**

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో న్యాతరి అనూష, రమేష్ దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి మంత్రి హాజరై కుటుంబ సభ్యులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద, నిరుపేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులు సంక్షేమ శాఖ మంత్రిని, శాలువాతో ఘనంగా సన్మానించారు,వీరి వెంట పీసీసీ కార్యవర్గ సభ్యులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు,



# నాచుపల్లిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కొడిమ్యాల, సెప్టెంబర్ 4,(ప్రజాజ్యోతి):**

మండలంలోని నాచుపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యోగ గురువు సుధాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో యోగ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# సర్వాపూర్ లో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం

**మల్యాల,సెప్టెంబర్ 4, ప్రజా జ్యోతి:**

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సర్వపూర్ గ్రామానికి చెందిన సాయవేణి లతా శ్రీశైలం ల ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపి దంపతులకు కానుకను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క అనిల్, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శనిగారపు తిరుపతి, ఫ్యాక్స్ చైర్మన్ నేరెళ్ల సతీష్ రెడ్డి, మ్యాక లక్ష్మణ్,ఇట్టిరెడ్డి అంజిరెడ్డి, బండి రవి గౌడ్, బివి రమణ, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# నూతన వధూవరులకు జువ్వాడి నర్సింగరావు ఆశీర్వాదం

- కావేరి గార్డెన్స్‌లో వివాహ వేడుక - వధూవరులను ఆశీర్వదించిన జువ్వాడి

**కోరుట్ల,సెప్టెంబర్ 04 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణానికి చెందిన మామిడిపల్లి విజయ్ మేనకోడలి వివాహ వేడుకలు శుక్రవారం పట్టణంలోని కావేరి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ వివాహ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల లింగారెడ్డితో పాటు వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌లోనే ఎరువుల బుకింగ్ :ఏఓ జ్యోతి

**కొడిమ్యాల, సెప్టెంబర్ 4,(ప్రజాజ్యోతి):**



రైతులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ తదితర ఎరువులను ఇకపై ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్న రైతులకే బుకింగ్ అవకాశం ఉంటుందని, సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత ఏఈఓ లను సంప్రదించాలని సూచించారు. ఎరువులతో పాటు అదనపు ఉత్పత్తులు కొనాలని డీలర్లు ఒత్తిడి చేస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని, సంబంధిత డీలర్లపై తగిన చర్యలు తీసుకుంటామని ఏఓ స్పష్టం చేశారు.

# మాటలు కాదు...
# పనులే నాయకత్వానికి నిదర్శనం!

## - క్రెడిట్ కోసం కాదు అభివృద్ధి కోసం కృషి
## - 32వ వార్డు అభివృద్ధికి కౌన్సిలర్ ఎం.ఏ. వసీమ్ ప్రత్యేక చొరవ
## - ఐబీఈద్గాహ్ మస్జిద్ పరిసరాల అభివృద్ధికి రూ.7.25 లక్షల నిధులు మంజూరు







**కోరుట్ల,సెప్టెంబర్ 04 ప్రజాజ్యోతి**

ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరుగుతూ నిధులు సాధించడమే నిజమైన ప్రజా నాయకత్వానికి నిదర్శనమని 32వ వార్డు కౌన్సిలర్ ఎం.ఏ. వసీమ్ నిరూపిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. 32వ వార్డులోని ఐబీ , ఈద్గాహ్ మస్జిద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిన కౌన్సిలర్ వసీమ్ చేసిన నిరంతర ప్రయత్నాలు ఫలించడంతో మొత్తం రూ. 7.25 లక్షల నిధులు మంజూరయ్యాయి.

**- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలపై ప్రత్యేక దృష్టి**

32వ వార్డులోని ఐబీ, ఈద్గాహ్ మస్జిద్ పరిసర ప్రాంతాల్లో చాలాకాలంగా రోడ్లు, డ్రైనేజీ, పరిసరాల పరిశుభ్రత వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలను గుర్తించిన కౌన్సిలర్ ఎం.ఏ. వసీమ్ వాటిని పరిష్కరించడాన్ని సవాలుగా తీసుకున్నారు. స్థానికుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం నిరంతరం ప్రయత్నించారు.

**- అధికారులను కలిసి నిధుల కోసం పట్టుదలతో ప్రయత్నం**

వార్డు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కౌన్సిలర్ వసీమ్ సంబంధిత అధికారులను పలుమార్లు కలిసి ఐబీ, ఈద్గాహ్ మస్జిద్ పరిసర ప్రాంతాల సమస్యలను వివరించారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు అవసరమని అధికారులను కోరుతూ తన ప్రయత్నాలను కొనసాగించారు. ఆయన ప్రత్యేక చొరవ, పట్టుదల ఫలితంగా అడిషనల్ కలెక్టర్ గారి ప్రత్యేక నిధుల నుంచి రూ. 3.75 లక్షలు మంజూరు కాగా, మున్సిపల్ చైర్మన్ ద్వారా వార్డు అభివృద్ధి నిధుల నుంచి రూ. 3.50 లక్షలు కేటాయించబడ్డాయి.

**రూ.7.25 లక్షలతో అభివృద్ధికి బాటలు - మంజూరైన నిధుల వివరాలు**

వార్డు అభివృద్ధి నిధులు: రూ. 3.50 లక్షలు,అడిషనల్ కలెక్టర్ ప్రత్యేక నిధులు: రూ. 3.75 లక్షలుమొత్తం నిధులు: రూ. 7.25 లక్షలుఈ నిధులతో 32వ వార్డులోని ఐబీ, ఈద్గాహ్ మస్జిద్ పరిసర ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. రోడ్లు, డ్రైనేజీ, పరిసరాల మెరుగుదల వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

**- 'క్రెడిట్' కోసం కాదు... ప్రజల కోసం పని చేయాలి**

గత కౌన్సిలర్ పదవీకాలంలో ఈ ప్రాంత అభివృద్ధికి తగిన ప్రాధాన్యత లభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్నోసార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అవసరమైన స్థాయిలో పనులు జరగలేదని చెబుతున్నారు. అయితే ప్రస్తుత కౌన్సిలర్ ఎం.ఏ. వసీమ్ సమస్యలను కేవలం ప్రస్తావించడం వరకు పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి అవసరమైన నిధులను సాధించేందుకు కృషి చేశారని స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజలకు అవసరమైన పనులు చేయడం ముఖ్యమా? లేక ఆ పనులకు ఎవరు క్రెడిట్ తీసుకున్నారనేది ముఖ్యమా? అనే చర్చ స్థానికంగా సాగుతోంది.




**- నాయకత్వం అంటే ప్రచారం కాదు... ప్రజా సమస్యల పరిష్కారం**

ప్రజా సమస్యలను గుర్తించడం, అధికారులను కలవడం, నిధుల కోసం ప్రయత్నించడం, చివరకు పనులు మంజూరయ్యేలా చూడటమే నిజమైన నాయకత్వమని కౌన్సిలర్ వసీమ్ చర్యలు చాటుతున్నాయని స్థానికులు అంటున్నారు.మాటలు చెప్పడం సులభం... కానీ సమస్యను పరిష్కరించేందుకు నిధులు తీసుకురావడం, పనులు జరిగేలా చూడడం కష్టం. ఆ పని కౌన్సిలర్ ఎం.ఏ. వసీమ్ చేస్తున్నారు అని పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**- వార్డు ప్రజల్లో హర్షం**

ఐబీ, ఈద్గాహ్ మస్జిద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి రూ. 7.25 లక్షల నిధులు మంజూరు కావడంతో 32వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలాకాలంగా ఎదురుచూస్తున్న మౌలిక వసతుల సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఏర్పడిందని వారు చెబుతున్నారు.ప్రజల అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన కౌన్సిలర్ ఎం.ఏ. వసీమ్ ను స్థానికులు అభినందనలు తెలిపారు. అలాగే ప్రత్యేక నిధులు మంజూరు చేసిన అడిషనల్ కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలిపారు. 32వ వార్డు అభివృద్ధే లక్ష్యంగా... ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కౌన్సిలర్ ఎం.ఏ. వసీమ్ కు ప్రజల మద్దతు కొనసాగాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

# అలరించిన రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలల స్వాగతోత్సవం

## - నివోరా2026 పేరుతో అంగరంగ వైభవంగా వేడుకలు..

## - ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

## - లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి కరస్పాండెంట్ యాద రామకృష్ణ












**కోరుట్ల,సెప్టెంబర్ 04 ప్రజాజ్యోతి**

స్థానిక పీబీ గార్డెన్‌లో రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో స్వాగతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఫైనల్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులు కలిసి ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. 'నివోరా2026' పేరుతో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల సందడి, ఉత్సాహంతో అంగరంగ వైభవంగా సాగాయి.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని, దానిని సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులు, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం గర్వపడేలా రాణించాలని ఆకాంక్షించారు.విద్యార్థి దశ భవిష్యత్ జీవితానికి ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన.. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాలలో లభిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.



**- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

స్వాగతోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలకు తోటి విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో అభినందనలు తెలిపారు. పాటలు, నృత్యాలు, వినోద కార్యక్రమాలతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయంగా స్వాగతం పలుకుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడంతో పాటు, సీనియర్‌జూనియర్ విద్యార్థుల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు గాడిపెల్లి హరిప్రియ, అంజయ్య గౌడ్, కేరళ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.ఏ. భారీ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్వేత, రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్, అధ్యాపక బృందం, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కొండగట్టుగుట్టపై మెరుగైన మొబైల్ సిగ్నల్ సేవలు

## - మొబైల్ టవర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**మల్యాల, సెప్టెంబర్ 4,ప్రజా జ్యోతి:** కొండగట్టు గుట్టపై మొబైల్ సిగ్నల్స్ లేక ఇబ్బంది పడిన భక్తుల తిప్పలను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తీర్చారు. కొండగట్టు గుట్టపై మెరుగైన మొబైల్ సిగ్నల్స్ కొరకు ఇండస్ టవర్స్ సంస్థ వారిచే ఏర్పాటుచేసిన నూతన మొబైల్ టవర్ ను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ మొబైల్ టవర్ అందుబాటులోకి రావడంతో అంజన్న దర్శనం కోసం గుట్ట పైకి వచ్చే భక్తులకు,స్థానికులకు, ప్రజలకు మెరుగైన మొబైల్స్ నెట్వర్క్, కమ్యూనికేషన్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి, ఆలయ సిబ్బంది,కాంగ్రెస్ నాయకులు,ఇండస్ టవర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# బీర్ పూర్ లో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు:

## వీధి వీధినా కృష్ణ నామస్మరణ

**బీర్పూర్, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):** గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణుడు, గోపికల ప్రత్యేక వేషధారణలతో భక్తులు గ్రామ వీధుల గుండా భజనలు, కీర్తనలు పాడుతూ సంకీర్తన (గ్రామ ప్రదక్షిణ) నిర్వహించారు. ప్రతి వీధిలోనూ మహిళలు స్వామివారికి మంగళ హారతులు ఇచ్చి భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు.అనంతరం ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద నిర్వహించిన సాంప్రదాయ గోపాల కాలువలు, ఉట్టి కొట్టడం కార్యక్రమాలు అత్యంత ఉత్సాహభరితంగా సాగాయి. యువకులు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. అఖండ భజనలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న ఈ వేడుకల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.







# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు







**కొడిమ్యాల, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి):** కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని కొడిమ్యాల మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.చిన్నారులు కృష్ణుడు వేషధారణలతో పలువురిని అలరించారు.వేడుకల్లో భాగంగా ఉట్టికొట్టి సంబరాలు చేసుకుంటున్నారు.